ఏకకాలంలో 'రైతుభరోసా' అందించాలి

- సర్పంచులకు పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- హైదరాబాద్‌లో జగిత్యాల బీఆర్ఎస్ నాయకులతో సమావేశం

హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కవితను కలిసిన బీఆర్ఎస్ నాయకులు

జగిత్యాల రూరల్, ఫిబ్రవరి 6: రైతులకు ఏకకాలంలో రైతుభరోసా నిధులు విడుదల చేయాలని, సర్పంచులకు రావల్సిన పెండింగ్ బిల్లులు తక్షణమే ఇవ్వాలని, లేదంటే ఉద్యమిస్తామని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గురువారం హైదరాబాద్‌లో జగిత్యాల నియోజకవర్గంలోని పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు ఆమెను మర్యాద పూర్వకంగా కలిశారు. గ్రామాల్లో రైతులు పడుతున్న కష్టాలు, పెండింగ్ బిల్లుల విషయాన్ని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ రైతు భరోసా విషయంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధిలేనట్లు కనిపిస్తుందని ధ్వజమెత్తారు. కేసీఆర్ హయాంలో రైతుబంధు నిధులు ఖాతాల్లో పడి సెల్‌ఫోన్లకు టంగు.. టంగుమంటూ మెస్సేజ్‌లు వచ్చేవన్నారు. రేవంత్ రెడ్డి సర్కార్ మాత్రం దశలవారీగా నామమాత్రపు నిధులను మాత్రమే విడుదల చేస్తూ రైతులను ఇబ్బందులు పెడుతున్నదని ధ్వజమెత్తారు. ఈ సీజన్‌లో అదును దాటిపోతున్నా రైతు భరోసా నిధులు పూర్తిస్థాయిలో విడుదల చేయకపోవడం సరికాదన్నారు. ఇది రైతులకు ద్రోహం చేయడమేనని స్పష్టం చేశారు. రైతులను మోసగించాలని చూస్తే తాము రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. సర్పంచుల పదవీ కాలం పూర్తయి ఏడాది గడుస్తున్నా వారి చేసిన పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులు విడుదల చేయకపోవడం కాంగ్రెస్ అసమర్థతను తెలియజేస్తుందని మండిపడ్డారు. ప్రభుత్వం తక్షణమే సర్పంచులకు పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇక్కడ జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, అర్బన్ మాజీ జడ్పీటీసీ సంగెపు మహేశ్, మాజీ ప్రజాప్రతినిధులు బుర్ర ప్రవీణ్, నాడెం శంకర్, ముప్పాల లక్ష్మణ్ రావు, అరుణ్‌కుమార్, భుక్య శ్రీనివాస్, పల్లపు వెంకటేష్, నాయకులు ఎల్ల రాజన్న, తేలు రాజు, నలువాల లక్ష్మణ్, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను అందుబాటులో ఉంచాలి

డీఆర్‌డీవో రఘువరన్

నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్డీవో రఘువరన్

కోరుట్ల రూరల్, ఫిబ్రవరి 6 : గ్రామస్తులకు నర్సరీలో వివిధ రకాల మొక్కలను అందుబాటులో ఉంచాలని డీఆర్డీవో రఘువరన్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని వెంకటాపూర్, సర్వరాజ్‌పూర్, ఐలాపూర్ గ్రామాల్లోని నర్సరీ, కంపోస్ట్‌షెడ్, వైకుంఠ దామం, ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వైకుంఠదామాలను పరిశుభ్రంగా ఉంచాలని, ప్రతి గ్రామాల్లోని నర్సరీల్లో గ్రామస్తులకు సరిపడేలా వివిధ రకాల మొక్కలను పెంచాలని, కంపోస్ట్‌షెడ్ నిర్వహణకు పలు సూచనలిచ్చారు. ఉపాధి హామీ పనుల ప్రగతిని పరిశీలించి, కూలీలను పెంచాలని పేర్కొన్నారు. ఎంపీడీవో ఓదెల రామకృష్ణ, కార్యదర్శులు నవీన్, నరేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

పోగొట్టుకున్న బ్యాగు అప్పగించిన పోలీసులు

బ్యాగును బాధితుడికి అందజేస్తున్న ఎస్ఐ శ్రీకాంత్

కోరుట్ల, ఫిబ్రవరి 6 : పట్టణంలోని కాల్వగడ్డ ప్రాంతానికి చెందిన చింత చంద్రశేఖర్ బైక్‌పై పని మీద బయటకు వెళ్తూ మార్గమధ్యంలో తన బ్యాగును గురువారం పోగొట్టుకున్నాడు. తిరిగి ఇంటికి వెళ్లి చూడగా తన బ్యాగు కనిపించకపోవడంతో పోలీసులను ఆశ్రయించాడు. బ్యాగులో తులం బంగారం, విలువైన వస్తువులు ఉన్నట్లు పోలీసులకు తెలిపాడు. బ్లూకోర్టు సిబ్బంది సంజీవ్, శ్రీనివాస్ సీసీ కెమెరా పుటేజీలను పరిశీలించి, బ్యాగు పడిపోయిన స్థలాన్ని గుర్తించారు. విచారణలో మున్సిపల్‌లో విధులు నిర్వర్తించే సలీం, సురేశ్ అనే వ్యక్తులు తమకు దొరికిన బ్యాగును లతీఫ్ హోటల్లో అందజేసినట్లు గుర్తించి బ్యాగును స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ శ్రీకాంత్ సమక్షంలో బాధితుడు చంద్రశేఖర్‌కు బ్యాగును అప్పగించారు. బ్యాగును నిజాయితీగా అప్పగించిన మున్సిపల్ ఉద్యోగులు సలీం, సురేశ్‌తో పాటు బ్లూకోర్టు సిబ్బందిని ఎస్ఐ అభినందించారు.

నమస్తే తెలంగాణ
CLASSIFIED

పాస్‌పోర్టు పోయింది

★ అజ్మీర అమృతలాల్ S/o. కిషన్, H.No. 4-78, బుగ్గ రాజేశ్వర తండా, అక్కాపల్లి, మం|| ఎల్లారెడ్డిపేట్, రాజన్న సిరిసిల్ల జిల్లా. నా పాస్‌పోర్టు అక్కపల్లి నుండి ఎల్లారెడ్డిపేటకు వస్తుండగా పోయింది. దొరికిన వారు సంప్ర|| 86399 69258.
NTK-0000

CHANGE OF NAME

★ I, AYESHA MOHAMMADI (Old name) W/o. Syed Khalid Mohiuddin, D/o. Mohammad Jaleel Pasha, H.No. 6-2-716, Hussainipura, Karimnagar dist. my name was changed to SYEDA AYESHA MOHAMMADI (NEW NAME)
NTK-00000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

విద్యార్థులకు అభినందనలు

కొడిమ్యాల, ఫిబ్రవరి 6 : మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థినులు బుధవారం మండల కేంద్రంలోని హైస్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించిన అండర్–18 బాలికల క్రీడా పోటీల్లో ప్రతిభ చూపి, జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కబడ్డీ, అథ్లెంటిక్, షాట్‌పుట్‌లో ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ వేణు, అధ్యాపకులు భాష్కర్ అభినందించారు. రాష్ట్ర స్థాయిలో రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులున్నారు.

సిరిపూర్ సహకార సంఘం సమస్యలను పరిష్కరించాలి

సహకార సంఘం చైర్మన్ అంజిరెడ్డి

మాట్లాడుతున్న అంజిరెడ్డి

మల్లాపూర్, ఫిబ్రవరి 6 : సిరిపూర్ సహకార సంఘం సమస్యలను ఉన్నత అధికారులు స్పందించి పరిష్కరించాలని సహకార సంఘం చైర్మన్ బద్దం అంజిరెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని సిరిపూర్ గ్రామంలోని సహకార సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల మాట్లాడుతూ, తమ సహకార సంఘం పాలకవర్గం ఎలాంటి అవినీతికి పాల్పడలేదని, అధికారులు సర్‌చార్జి నోటీసులు, పాలకవర్గం రద్దు తదితర అంశాలపై నోటీసులు జారీ చేయడం సరికాదన్నారు. ఈ విషయమై పాలకవర్గ సభ్యులు హైకోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. అలాగే తమ సహకార సంఘంకు సంబంధించిన వేంపేటలోని భూమి, సిరిపూర్‌లోని ఓ ఇల్లును తదితర ఆస్తులపై పూర్తిస్థాయిలో తమ సంఘంకు అటాచ్‌మెంట్ చేయాలని కోరారు. సహకార సంఘంకు సంబందించి కేడీసీసీడీ బ్యాంక్ నుంచి రూ. 50 లక్షల మేర రావాల్సి ఉందని, త్వరగా అధికారులు స్పందించి, తమకు ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ సుధాకర్‌రెడ్డి, డైరెక్టర్లు, లక్ష్మీనారాయణ, గంగరాజం, రవి, ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిగి ఉండాలి

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎన్‌డీఆర్ఎఫ్ బృందం

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 6 : విపత్తుల సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలు ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలిన తహసీల్దార్ ప్రసాద్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు నిర్వహించిన జాతీయ విపత్తుల అవగాహన కార్యక్రమంలో తహసీల్దార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, విద్యార్థులు ప్రజలు విపత్తుల సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండడం ద్వారా వారి కుటుంబాలనే కాకుండా చుట్టుపక్కల ఉన్నవారిని కూడా రక్షించుకోవచ్చునన్నారు. అంతకు ముందు పది బెటాలియన్ కమాండర్ ముఖేశ్ కుమార్ వారి బృందంతో కలిసి విపత్తుల సమయంలో ఎదురయ్యే సంఘటనలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు, ప్రజలకు ప్రత్యక్ష ప్రదర్శన ద్వారా కండ్లకు కట్టినట్టు చూపిస్తూ అవగాహన కల్పించారు. ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంఈవో మధు, వైద్యాధికారి హరీష్‌కుమార్, ఎఎస్ఐ మద్దిలేటి, ఎన్‌డీఆర్ఎఫ్ బృందం సభ్యులు విద్యార్థులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

బట్టపల్లి అంబేద్కర్ సంఘం విగ్రహ కమిటీ ఏర్పాటు

కార్యదర్శికి వినతి పత్రం అందజేస్తున్న కమిటీ సభ్యులు

సారంగాపూర్, ఫిబ్రవరి 6 : మండలంలోని బట్టపల్లి గ్రామంలో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో విగ్రహ ఏర్పాటు కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పూడూరి శోభన్, ప్రధాన కార్యదర్శిగా అర్రె ప్రేమనందం, కోశాధికారిగా తిరుపెల్లి మధుకర్, అర్రె డానియోల్, ఉపాధ్యక్షులుగా దాసరి ప్రసాద్, తిరుపెల్లి రాజయ్య, చుంచు రాజు, సంయుక్త కార్యదర్శులుగా తిరుపెల్లి వెంకటేశ్, ఎట్టేం శేఖర్, పూడూరి అంజయ్య, కార్యవర్గ సభ్యులుగా దాసరి అనిల్, బెత్తెపు అశోక్, తిరుపెల్లి మల్లయ్య, దాసు, అభినయ్‌ను ఎన్నుకున్నారు. అనంతరం అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు కోసం గ్రామ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. నాయకులు ముత్తయ్య, లచ్చయ్య, మల్లేశ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలోనే మెరుగైన విద్య

గొల్లపల్లి, ఫిబ్రవరి 6 : ప్రభుత్వ కళాశాలల్లోనే అడ్మిషన్ తీసుకోవాలని గొల్లపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు గురువారం ప్రచారం చేశారు. మండలంలోని చిల్వాకోడూర్ జడ్పీ పాఠశాలను సందర్శించి, పదో తరగతి విద్యార్థులతో చర్చించారు. కళాశాలలో చేరితే ఉచిత పాఠ్యపుస్తకాలతో పాటు రూ. 10 వేల స్కాలర్‌షిప్, ఉచిత ఎంసెట్ కోచింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ కళాశాలల్లోనే మెరుగైన విద్య అందుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మల్లయ్య, అధ్యాపకులు రాంప్రసాద్, సంతోష్, నాగలక్ష్మి పాల్గొన్నారు.

8న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు

మెట్‌పల్లి, ఫిబ్రవరి 6 : పట్టణంలోని మినీ స్టేడియంలో ఈ నెల 8న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్తయ్యరెడ్డి గురువారం తెలిపారు. 11వ తెలంగాణ రాష్ట్ర యూత్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీలకు గాను జిల్లా నుంచి క్రీడాకారులను ఎంపిక చేసేందుకు గాను జిల్లా స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామీణ క్రీడాకారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులను హైదరాబాద్‌లోని ఉస్మానియా సింథటిక్ ట్రక్‌లో జరగనున్న ఈ నెల 18,19 తేదీల్లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. అండర్ 14, 16,18,20 విద్యార్థులు, యువతకు రన్నింగ్, షార్ట్‌పుట్, డిస్కిస్ త్రో, లాంగ్‌జంప్, కిడ్స్ జావిలిన్‌త్రో తదితర పోటీలు నిర్వహిస్తారని, ఆసక్తి గల క్రీడాకారులు ఈ నెల 8న ఉదయం 8 గంటలకు మినీ స్టేడియంలో హాజరుకావాలని తెలిపారు.

పుస్తె, మట్టెలు అందజేత

పుస్తె మట్టెలు అందజేస్తున్న ప్రభాకర్

కోరుట్ల రూరల్, ఫిబ్రవరి 6 : మండలంలోని మోహన్‌రావుపేట గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వైద్యులు మాడిశెట్టి ప్రభాకర్ నూతన వధువుకు పుస్తె, మట్టెలు, పట్టు చీరను గురువారం అందజేశారు. ఈ మేరకు ఐలాపూర్ గ్రామానికి చెందిన కర్ని కిసాన్–రజిత దంపతుల కూతురు శ్రీలేఖ వివాహానికి తన వంతు సహాయంగా పుస్తె మట్టెలు పట్టు చీరను అందజేశారు. ఇప్పటి వరకు 80మంది నిరుపేద కుటుంబాలకు వధువులకు పుస్తె మట్టెలు అందజేసినట్లు ఆయన తెలిపారు.

పారిశుధ్య కార్మికులకు ఉచిత వైద్య సేవలు

కోరుట్ల, ఫిబ్రవరి 6 : పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో గురువారం ఐసీటీసీ, సంపూర్ణ సురక్ష కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో ఉచితంగా మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 150 మంది పారిశుధ్య కార్మికులకు ఉచితంగా రక్త పరీక్షలు, టీబీ నిర్ధారణ పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. టీబీ నిర్ధారణ పరీక్షా కేంద్రాన్ని జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్మికులకు క్షయపై అవగాహన కల్పించారు. వ్యాధి సోకిన వారు తగిన చికిత్స తీసుకుంటే పూర్తిగా నయం అవుతుందని చెప్పారు. ప్రభుత్వాసుపత్రిలో ఉచితంగా పరీక్షలు చేసి, మందులు అందిస్తామని తెలిపారు. క్షయ వ్యాధి లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి, ఆసుపత్రి సూపరింటెండెంట్ సునీతరాణి, వైద్యులు వినోద్, శృతి లయ, శివాని, ఐసీటీసీ కౌన్సిలర్ మల్లికార్జున్, మేనేజర్ సంతోష్, ఫార్మాసిస్ట్ ప్రవళిక, ల్యాబ్ టెక్నిషియన్, సాజిద్ అలీ, శ్రీధర్, రమ్య, నాగరాజు, శంకర్, రాజేశ్, ఏఎన్ఎం పాల్గొన్నారు.

కార్మికులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఎస్ఐ సందీప్‌నకు వినతిపత్రం ఇస్తున్న రెడ్డి సంఘం నాయకులు

తీన్మార్ మల్లన్నపై ఫిర్యాదు

కొడిమ్యాల, ఫిబ్రవరి 6 : రెడ్డి వర్గంపై అనుచిత వాఖ్యాలు చేసిన ఎమ్మెల్సీ చింత పండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్నపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గురువారం మండలంలోని పోలీస్‌స్టేషన్‌లో రెడ్డి సామాజికవర్గం నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఇటీవల వరంగల్ సభలో, టీవీషోలో రెడ్డి వర్గాన్ని కించపరిచేలా మా ట్లాడుతున్నారని, వెంటనే చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో తెలిపారు. మండల రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు గడ్డం చంద్రమోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఉట్కూరి మల్లారెడ్డి, అనుమాండ్ల అజయ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మందల గోపాల్‌రెడ్డి, కోశాధికారి పాశం కిషన్‌రెడ్డి, బండ నర్సింహారెడ్డి, సురకంటి ముత్యంరెడ్డి, సందిరెడ్డి లక్ష్మారెడ్డి, నోముల రాంరెడ్డి ఉన్నారు.

చైన్ స్నాచర్‌కు మూడు నెలల జైలు

జగిత్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 7 : చైన్ స్నాచర్‌కు మూడు నెలల జైలు శిక్ష విధిస్తూ జగిత్యాల జడ్జి శ్రీనిజ తీర్పునిచ్చారు. జగిత్యాల రూరల్ మండలం తాటిపెల్లి గ్రామానికి చెందిన ఆకుల రాధ తన కుమార్తెతో కలిసి గ్రామ శివారులోని వ్యవసాయ పొలం వద్ద కు వెళ్తున్నారు. మండలంలోని నర్సింగాపూర్ గ్రామానికి చెందిన పోచంపెల్లి మహేశ్ బైక్‌పై వచ్చి ఆకుల రాధ కుమార్తె మెడలోం చి బంగారు గొలుసు లాక్కొని పోయేందుకు ప్రయత్నించగా, ఆమె చాకచక్యంగా తప్పించుకొని కేకలు వేయగా, చుట్ట పక్కల వారు అక్కడికి చేరుకునేలోగా చైన్ స్నాచర్ అక్కడి నుంచి పరారయ్యాడు. బాధితురాలి తల్లి రాధ జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకొని విచారించిన జగిత్యాల రూరల్ పోలీసులు నిందితుడిని గుర్తించి చార్జ్‌షీట్ దాఖలు చేసి, సాక్ష్యాధారాలు కోర్టుకు సమర్పించారు. కేసు పరిశీలించిన జడ్జి చైన్ స్నాచర్‌కు మూ డు నెలల జైలు శిక్షతో పాటు రూ. 500 జరిమానా విధించారు.

యూరియా కొరత తీర్చాలి

కథలాపూర్, పిబ్రవరి 6 : మండలంలోని తాండ్ర్యాలలో యూరి య కొరత తీర్చాలని కథలాపూ ర్ మండల వైస్ చైర్మన్ కిరణ్‌రావు గురువారం ఏఈవో సుష్మకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడు తూ, యూరియా కొరతతో రైతు లు ఇబ్బందులు పడుతున్నారని, పంట వివరాలు సేకరించి, రైతులకు యూరియాను అందజేయాలని కోరారు. రైతు నాయకుడు చిన్నారెడ్డి పాల్గొన్నారు.

హన్సికకు అభినందనలు..

జగిత్యాల, ఫిబ్రవరి 6 : శ్రీ చైతన్య హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని హన్సిక తన అసాధారణమైన ప్రతిభతో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు సాధించింది. డ్యాన్స్‌లో తన అద్భుతమైన ప్రదర్శన ద్వారా ఈ అరుదైన ఘనతను సాధించింది. ఈ మేరకు గురువారం శ్రీ చైతన్య హైస్కూల్ కరస్పాండెంట్ కే గంగారెడ్డి, డైరెక్టర్ కే గోవర్ధన్ రెడ్డి, ప్రిన్సిపాల్ ఆమెను అభినందించారు.

విపత్తుల రక్షణపై విద్యార్థులకు ఎన్డీఆర్ఎఫ్ బృందం అవగాహన

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి 6: ఆకస్మిక విపత్తులు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం(ఎన్డీఆర్ఎఫ్) బృందం గురువారం మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ బాలుర గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. మానవ తప్పిదం లేదా అగ్ని ప్రమాదాలు, వరదలు, భూకంపాలు తదితర ప్రకృతి వైపరిత్యాలతో సంభవించే విపత్తుల నుంచి ఎలా కాపాడుకోవాలి అన్నం అంశాలపై విద్యార్థులకు వివరించారు. అప్రమత్తంగా వ్యవహరిస్తే అత్యవసర పరిస్థితుల నుంచి బయటపడవచ్చని సూచించారు. మెటపల్లి తహసీల్దార్ శ్రీనివాస్, ఎంఈవో చంద్రశేఖర్, ఆర్ఐ ఉమేశ్, ప్రిన్సిపాల్ మాధవీలత, ఎన్డీఆర్ఎఫ్ ఎస్సై ముఖేశ్, బృందం సభ్యులు పాల్గొన్నారు.

ఇటుక బట్టీల కార్మికులకు సరుకుల పంపిణీ

జగిత్యాల రూరల్, ఫిబ్రవరి 6 : ఇటుక బట్టీల కార్మికులకు తారక రాంనగర్ గ్రామం శివారులోని ఇటుక బట్టీల్లో పని చేసేవారి గృహాలను శుక్రవారం జగిత్యాల ప్రాజెక్ట్ సీడీపీవో మమత సందర్శించి, తాత్కాలికంగా నివాసం ఉంటున్న లబ్ధిదారులకు 7వ నెల నుంచి మూడేళ్లలోపు పిల్లలకు బాలామృతం, ఎగ్స్ పంపిణీ చేశారు. వేసవి దృష్ట్యా తీసుకోవాల్సిన ఆహారం, ఆరోగ్యంపై జాగ్రత్తలను వివరించారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అప్రమత్తంగా ఉండాలని తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సూపర్ వైజర్ లావణ్య, అంగన్‌వాడీ టీచర్ రజిత పాల్గొన్నారు.

ఎస్ఎస్‌సీ, ఆర్ఆర్‌బీ, బ్యాంకింగ్ కోసం ఉచిత శిక్షణ

జగిత్యాల రూరల్, ఫిబ్రవరి 6 : తెలంగాణ వెనుబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ వెనుబడిన తరగతుల ఉద్యోగ, నైపుణ్య అభివృద్ధి, శిక్షణ కేంద్రం కరీంనగర్ ఆధ్వర్యంలో ఎస్ఎస్‌సీ, ఆర్ఆర్‌బీ, బ్యాంకింగ్ పోస్టుల కోసం ఉచిత శిక్షణ కోసం అర్హులైన నిరుదోగులు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి జీ సునిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు చెందిన యువత నుంచి ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 9 వరకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు ఫోన్‌నంబర్ 0878 2268686 ను లేదా కరీంగనర్‌లోని బీసీ స్టడీసర్కిల్ సంప్రదించాలని పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల క్షేత్రస్థాయి పర్యటన

కోరుట్ల, ఫిబ్రవరి 6 : పట్టణంలోని కల్లూరు రోడ్డు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు గురువారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా హైదరాబాద్‌లోని నెహ్రూ జులాజికల్ పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా జంతు ప్రదర్శనశాలలో వివిధ రకాల జంతువులు, పక్షుల ను తిలకించారు. ఏకో క్లబ్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఏనుగుల సఫారి సమీపంలో ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించారు. జూ క్యూరేటర్, అధికారులు, ఏకో క్లబ్ బాధ్యుడు చావ్లా లక్ష్మీనారాయణ, ప్రధానోపాధ్యాయుడు కృష్ణమోహన్‌రావు, ఉపాధ్యాయులు నాగరాజు, గంగామోహన్, సంతోష్ ఉన్నారు.

చికిత్స పొందుతూ గీత కార్మికుడి మృతి

మల్లాపూర్, ఫిబ్రవరి 6 : మండలంలోని సాతారం గ్రామానికి చెందిన రుత్తె గంగనర్సయ్య (63) గీత కార్మికుడు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ రాజు గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గంగనర్సయ్య జీవనోపాధి కోసం గ్రామంలో గీత కార్మికుడిగా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 3వ తేదీన ప్రమాదవశాత్తు ఈత చెట్టుపై నుంచి పైడి తీవ్రగాయాల పాలయ్యాడు. చికిత్స కోసం సదరు వ్యక్తిని కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించంగా, గురువారం చికిత్స పొందుతూ మరణించినట్లు కుటంబీకులు, పోలీసులు తెలిపారు. మృతుడి భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కమ్మరిపేటలో కుక్కలదాడి.. గొర్రె, మేకలు మృతి

బాధితులతో మాట్లాడుతున్న నరేశ్‌రెడ్డి

మేడిపల్లి, ఫిబ్రవరి 6 : భీమారం మండలం కమ్మరిపేట గ్రామానికి చెందిన బైరి లింగన్నకు చెందిన 45 గొర్రెలు, మేకలను కుక్కలు దాడి చేసి, కొరికి వేయడంతో మృత్యువాత పడ్డాయి. మృతి చెందిన గొర్రెలు, మేకల విలువ సుమారు 4 లక్షల వరకు ఉంటుందని బాధితుడు తెలిపాడు. విషయం తెలుసుకున్న టీపీసీసీ గల్ఫ్ కన్వీనర్ సింగిరెడ్డి నరేశ్ రెడ్డి గురువారం లింగన్నను పరామర్శించారు. విషయాన్ని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లి ఆర్థికంగా ఆదుకునేందుకు కృషి చేస్తానని తెలిపారు. గ్రామస్తులు తిరుపతి, నరేశ్, లక్ష్మణ్, మధు, శేఖర్, స్వామిరెడ్డి, సంజీవ్ తదితరులు ఉన్నారు.

బ్రహ్మోత్సవాలకు రావాలని ఎమ్మెల్సీ కవితకు ఆహ్వానం

ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నాయకులు

సారంగాపూర్, ఫిబ్రవరి 6 : మండలకేంద్రంలోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఫిబ్రవరి 7 శుక్రవారం నుంచి 19వ తేదీ వరకు 12 రోజుల పాటు జాతర బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించడానికి ఆలయ అధికారులు, కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా, గురువారం జాతర బ్రహ్మోత్సవాలకు రావాలని కోరుతూ మండల బీఆర్ఎస్ నాయకులు హైదరాబాద్‌లో ఎమ్మెల్సీలు కల్వకుంట్ల కవిత, ఎల్ రమణను మర్యాద పూర్వకంగా కలిసి ఉత్సవాలకు రావాలని ఆహ్వాన పత్రిక, స్వామివారి చిత్రపటాలను అందజేశారు. జడ్పీ మాజీ చైర్మన్ దావ వసంత, సారంగాపూర్ ఉమ్మడి మండల మాజీ జడ్పీటీసీ కొల్ముల రమణ, బీఆర్ఎస్ అధ్యక్షుడు నేరెల్ల సుమన్ గౌడ్, మాజీ విండో చైర్మన్లు సాగి సత్యం రావు, మెరుగు రాజేశం, లింగన్న పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ రమణకు ఆహ్వానం..

జగిత్యాల, ఫిబ్రవరి 6 : హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో కరీంనగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎల్ రమణని మర్యాదపూర్వకంగా బీర్పూర్ మండలం బీఆర్ఎస్ నాయకులు కలిసి బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ నెల 9వ తేదీ నుంచి జరుగబోయే బీర్పూర్ లక్ష్మీ నర్సిసింహ స్వామి బ్రహ్మోత్సవ మహోత్సవానికి రాగలరని ఎమ్మెల్సీకి బీర్పూర్ మండల నాయకులు ఆహ్వాన పత్రికను అందజేశారు. బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మీరు ఏపార్టీ ?'

సారంగాపూర్, ఫిబ్రవరి 6 : జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ సంజయ్ కుమార్ ఏ పార్టీయో స్పష్టత ఇవ్వాలని సారంగాపూర్, బీర్‌పూర్ మండల బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే డాక్టర్ సంజ య్ కుమార్ కారు గుర్తుపై గెలిచి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారని, కానీ, కాంగ్రెస్ అధికారిక కార్యక్రమాల్లో ఎందుకు పాల్గొనడం లేదని ప్రశ్నించారు. గురువారం జరిగిన సీఎల్‌పీ సమావేశంలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ హాజరుకాలేదన్నారు. ఇటీవల కరీంగర్‌లో అధికారిక కార్యక్రమంలో ఓ శాసన సభ్యులు నీది ఏపార్టీ అని అడిగితే కాంగ్రెస్ పార్టీ అని చెప్పుతున్న ఎమ్మెల్యే కాంగ్రెస్ అధికారిక కార్యక్రమాల్లో ఎందుకు పాల్గొనడం లేదో అసలు ఏ పార్టీయో స్పష్టత ఇవ్వాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మండల మాజీ జడ్పీటీసీ కొల్ముల రమణ, సారంగాపూర్, బీర్‌పూర్ మండల అధ్యక్షులు తేలు రాజు, నేరెల్ల సుమన్ గౌడ్, మాజీ విండో చైర్మన్లు సాగి సత్యం రావు, మెరుగు రాజేశం, మాజీ సర్పంచులు రవీందర్, లింగన్న, అరుణ్‌కుమార్, వెంకటేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

కోరుట్ల రూరల్, ఫిబ్రవరి 06 : మాజీ సర్పంచులు గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని కోరుట్ల మండల సర్పంచుల పోరం మాజీ ప్రధాన కార్యదర్శి వనతడు పుల అంజయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ సర్పంచులను అరెస్టు చేయడం మీద ఉన్న దృష్టి పెండింగ్ బిల్లుల చెల్లించే ఆలోచన లేదని ఆవేదన వ్యక్తం చేశా రు. ఇప్పటికైనా ప్రభుత్వం పెండింగ్ బిల్లు లను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు.

రక్తదానం

కథలాపూర్, ఫిబ్రవరి 6 : మండలంలోని సిరికొండ గ్రామానికి చెందిన ఎల్లా అరుణ అనారోగ్యంతో కోరుట్ల పట్టణంలోని ఓ దవాఖానలో చికిత్స కోసం చేరింది. డాక్టర్ పరీక్షించి చికిత్స సమయంలో 'ఓ' పాజిటీవ్ రక్తం అవసరమని కుటుంబసభ్యులకు తెలిపారు. కుటుంబసభ్యుల సూచన మేరకు.. స్పందించిన అదే గ్రామానికి చెందిన తోపారపు నర్సయ్య గురువారం దవాఖానకు వెళ్లి రక్తదానం చేశాడు. కాగా, నర్సయ్యను మాజీ ఎంపీపీ లింబాద్రి, డాక్టర్లు, గ్రామస్తులు, కుటుంబసభ్యులు అభినందించారు.

వైద్యాధికారులతో సమీక్ష..

వెల్గటూర్, ఫిబ్రవరి 6 : వెల్గటూరు, అంబర్పేట మండల వైద్యాధికారులతో వెల్గటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల్ లెవెల్ టాస్క్ ఫోర్స్ సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫిబ్రవరి 10న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఆల్బెండజోల్ టాబ్లెట్ల పంపిణీపై చర్చించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు లవకుమార్, స్వరూప మాట్లాడుతూ, 10న వెల్గటూర్ ఎండపల్లి మండలాలలో పాఠశాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో, జూనియర్ కాలేజీలో ఏడాది నుంచి 19 ఏండ్ల వయసు గల పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయాలన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఎమ్మార్వో శేఖర్, ఎంఈవో ప్రభాకర్, రామచందర్, సీహెచ్‌వో జగన్నాథం, సూపర్వైజర్స్ మనోరమ, శ్రీనివాస్, చంద్ర లీల, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.